

సిరిసిల్ల పాతబస్టాండ్‌లోని నేతన్న విగ్రహానికి పూల మాల వేస్తున్న మంత్రి కేటీఆర్



సిరిసిల్లో అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేస్తున్న మంత్రి కేటీఆర్



సిరిసిల్ల తెలంగాణ భవన్‌లో మంత్రి కేటీఆర్‌ను ఆశీర్వదిస్తున్న పూజారులు



ధర్మపురి : ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో కుటుంబసమేతంగా పూజలు నిర్వహిస్తున్న మంత్రి ఈశ్వర్

# నామినేషన్ల పండుగ

- పండుగ వాతావరణంలో దాఖలు
- సాదాసీదాగా దాఖలు చేసిన మంత్రి కేటీఆర్
- అట్టహాసంగా వేసిన పలువురు అభ్యర్థులు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భారీగా నామినేషన్లు దాఖలు

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని 13 నియోజకవర్గాల్లో నామినేషన్ల జాతర కొనసాగుతున్నది. ఆయా పార్టీల, స్వతంత్ర అభ్యర్థులు పండుగ వాతావరణంలో దాఖలు చేస్తున్నారు. గురువారం సిరిసిల్లలో మంత్రి, బీఆర్ఎస్ అభ్యర్థి కేటీఆర్ సాదాసీదాగా నామినేషన్ వేయగా, పలువురు అభ్యర్థులు వేలాది మంది ప్రజల సమక్షంలో అట్టహాసంగా దాఖలు చేశారు. మరికొందరు మరిన్ని సెట్ల నామినేషన్లు వేశారు. కాగా, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆరు రోజుల్లో భారీగా నామినేషన్లు దాఖలయ్యాయి.

## మహనీయులను స్మరించుకొని.. నామినేషన్ దాఖలు చేసి..

- సిరిసిల్ల బీఆర్ఎస్ అభ్యర్థిగా మంత్రి కేటీఆర్ సాదాసీదాగా నామినేషన్
- స్వచ్ఛందంగా తరలివచ్చిన అభిమానులు, కార్యకర్తలు

సిరిసిల్ల /సిరిసిల్ల టౌన్, నవంబర్ 9: ఎలాంటి హంగూ.. ఆర్భాటం లేకుండా మంత్రి కేటీఆర్ గురువారం సిరిసిల్ల బీఆర్ఎస్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఆయన, ఉదయం 11.30 గంటలకు సిరిసిల్లకు చేరుకున్నారు. మొదట రగుడు జంక్షన్ వద్ద ఉన్న తెలంగాణ భవన్‌కు రాగా, నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, చీటి నర్సింగరావు ఘనస్వాగతం పలికారు. అక్కడ సర్వమత ప్రార్థనల అనంతరం రామన్న, ముఖ్య నాయకులతో కలిసి నామినేషన్ వేసేందుకు వెళ్తూ మహనీయులను స్మరించుకున్నారు. పాత బస్టాండ్‌లోని సంజీవయ్య, నేతన్న, ప్రధాన చౌరస్తాలో అంబేద్కర్, మార్కెట్ ఏరియాలో గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేశారు. ఉదయం 11.40 గంటలకు ఆర్డీవో కార్యాలయానికి వెళ్లి, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, వీర్నపల్లి జడ్పీటీసీ గుగులోత్ కళావతి, ముస్తాబాద్ మండల బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు కొమ్ము బాలయ్య, గంభీరావుపేట ఏఎంసీ చైర్మన్ హన్మంతరెడ్డితో కలిసి 11.45 గంటలకు నామినేషన్ దాఖలు చేశారు. తిరిగి వస్తూ.. రేణుకా ఎల్లమ్మ జంక్షన్‌లోని కొండా లక్ష్మణ్ బాపూజీ, మొదటి బైపాస్‌రోడ్డులోని నర్సింగ్ కళాశాల చౌరస్తాలో ఉన్న సర్దార్ సర్వాయిపాపన్న విగ్రహాలకు నివాళులర్పించారు. మధ్యాహ్నం 12.20 గంటలకు తెలంగాణభవన్‌కు చేరుకొని, అక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మధ్యాహ్నం 1.30 గంటలకు హెలీప్యాడ్ చేరుకొని, తిరిగి హైదరాబాద్‌కు పయనమయ్యారు. అయితే, నామినేషన్ సందర్భంగా వందలాది మంది అభిమానులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా తరలివచ్చారు. 'రామన్న మీ వెంటే మేమున్నాం' అంటూ మద్దతు తెలిపారు. బైక్‌లు, కార్లకు గులాబీ జెండాలు కట్టుకొని కేటీఆర్ కాన్వాయ్ వెంట ర్యాలీగా ఆర్డీవో కార్యాలయానికి చేరుకున్నారు. దారిపొడవునా 'జై కేటీఆర్' 'జైజై కేటీఆర్' నినాదాలతో హోరెత్తించారు. నామినేషన్ వేసిన అనంతరం కేటీఆర్‌ను కలిసేందుకు కార్యకర్తలు పోటీపడ్డారు. మంత్రి అందరికీ అభివాదం చేస్తూ ముందుకు సాగారు.

## మంత్రి గంగుల మరోసారి..



కరీంనగర్‌లో రిటర్నింగ్ అధికారి మహేశ్వర్ కు నామినేషన్ పత్రం అందజేస్తున్న మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్ శాసనసభా నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థిగా మంత్రి గంగుల కమలాకర్ గురువారం మరోసారి నామినేషన్ దాఖలు చేశారు. ఉదయం 11:30 కు స్థానిక వేంకటేశ్వర దేవాలయంలో నామినేషన్ పత్రాలతో పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడి నుంచి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యుల ఆశీర్వచనం తీసుకొని, నేరుగా రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి చేరుకున్నారు. ఆర్వో కే మహేశ్వర్‌కు నామినేషన్ పత్రాలను మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేని మధు, పలువురు నాయకులతో కలిసి అందజేశారు. వాటిని పరిశీలించిన ఆర్వో అన్ని సక్రమంగా ఉన్నట్లు నిర్ధారించి, ఎన్నికల ప్రవర్తనా నియమావళి, పాటించాల్సిన సూచనల కరదీపికలు మంత్రి గంగులకు అందజేశారు.

**- కరీంనగర్ కలెక్టరేట్, నవంబర్ 9**

## అట్టహాసంగా మంత్రి కొప్పుల

ధర్మపురి: కొప్పుల ఈశ్వర్ ర్యాలీలో భారీగా పాల్గొన్న జనం ➤



ధర్మపురి బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి కొప్పుల ఈశ్వర్ గురువారం అట్టహాసంగా నామినేషన్ వేశారు. కాగా, మంత్రి ఈశ్వర్ ఉదయాన్నే కుటుంబసమేతంగా రామగుండం విజయదుర్గాదేవి, అయ్యప్పస్వామివారి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం ధర్మపురి నృసింహుడి క్షేత్రానికి వచ్చి, స్వామివారిని దర్శించుకున్నారు. భారీ జన సందోహం మధ్య ర్యాలీగా వెళ్లారు. ధర్మపురిలోని రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వెళ్లి నామినేషన్ వేశారు. కొప్పులతో పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్‌నేతకాని ఆర్వో కార్యాలయం దాకా రాగా, కార్యాలయం లోపలికి డీసీఎమ్మెస్ చైర్మన్ డా.ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, జడ్పీటీసీ బాధినేని రాజేందర్ వెళ్లారు. **-ధర్మపురి, నవంబర్ 9**

## పుట్ట మధూకర్ తరఫున మూడో సెట్

మంథనిలోని ఆర్‌వో కార్యాలయంలో పుట్ట మధూకర్ తరఫున నామినేషన్ పత్రాలు అందజేస్తున్న నాయకులు ➤



మంథని, నవంబర్ 9: మంథని నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పుట్ట మధూకర్ మరో మూడు నామినేషన్ సెట్లను దాఖలు చేశారు. గురువారం బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మాదాడీ ప్రభాకర్‌రెడ్డి, ప్రముఖ న్యాయవాది శశికాంత్‌కాచే, బీఆర్ఎస్ నాయకుడు మల్లారెడ్డిద్వారా నామినేషన్లు వేశారు. అలాగే బీఆర్ఎస్ మంథని నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా మున్సిపల్ చైర్ పర్సన్ పుట్ట శైలజ సైతం తన నామినేషన్ పత్రాన్ని దాఖలు చేశారు. ఈ మేరకు స్థానిక ఆర్‌వో కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి హనుమానాయక్‌కు తన నామినేషన్ పత్రాన్ని పుట్ట శైలజ అందజేశారు.

## ఆలయంలో పూజలు చేసి దాసరి..



పెద్దపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి దాసరి మనోహర్ రెడ్డిని ఆశీర్వదిస్తున్న వేద పండితులు

పెద్దపల్లి టౌన్ నవంబర్ 9: పెద్దపల్లి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి దాసరి మనోహర్‌రెడ్డి గురువారం కార్యకర్తలతో ర్యాలీగా వెళ్లి నామినేషన్ వేశారు. అంతకుముందు తన నివాసంలో అర్చకులు ఆయనతో పూజలు చేయించి ఆశీర్వచనం అందించారు. అక్కడి నుంచి రైల్వేస్టేషన్ రోడ్డులోని అభయాంజనేయస్వామి ఆలయంలో కుటుంబసమేతంగా పూజలు చేశారు. అనంతరం పెద్దపల్లిలోని రిటర్నింగ్ కార్యాలయానికి చేరుకున్నారు. పెద్దపల్లి రిటర్నింగ్ ఆఫీసర్ మధుమోహన్‌కు నామినేషన్ పత్రాలు సమర్పించారు. తర్వాత పెద్దమసీదు నుంచి వేలాదిగా తరలివచ్చిన శ్రేణులతో కలిసి ర్యాలీగా అమర్‌నగర్, ప్రగతినగర్, అయ్యప్ప దేవాలయం మీదుగా బస్టాండ్ వరకు చేరుకున్నారు. ఆయన వెంట మండలి చీఫ్ విప్ తానిపర్తి భానుప్రసాద్‌రావు, బీఆర్ఎస్ నాయకులు సీ. సత్యనారాయణరెడ్డి, మేకల మల్లేశం, వేముల రాంమూర్తి, తిరుపతి రెడ్డి, రాంరెడ్డి ఉన్నారు.



పెద్దపల్లి టౌన్ : పెద్దపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి దాసరి మనోహర్‌రెడ్డి ర్యాలీలో పాల్గొన్న కార్యకర్తలు, ప్రజలు



గోదావరిఖని : కోరుకంటి నామినేషన్ సందర్భంగా స్టేడియానికి తరలివచ్చిన ప్రజలు

## గులాబీ దండుతో కదిలి..

గోదావరిఖని/జ్యోతినగర్, నవంబర్ 9: కోరుకంటి చందర్ గురువారం అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేశారు. అంతకుముందు ఇంటివద్ద కుటుంబసభ్యులతో కలిసి హిందూ, ముస్లిం, క్రైస్తవ మతపెద్దల ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం 'ఖని' లోని సింగరేణి గ్రౌండ్‌లో నిర్వహించిన ఆశీర్వాద సభకు హాజరయ్యారు. అక్కడి నుంచి భారీగా తరలివచ్చిన గులాబీ దండుతో కలిసి ఎన్టీపీసీలోని రిటర్నింగ్ ఆఫీసుకు వెళ్లి ఆర్వో అరుణశ్రీకి నామినేషన్ పత్రాలు అందించారు. ఆయన వెంట మండలి చీఫ్‌విప్ భానుప్రసాద్‌రావు, నియోజకవర్గ బీఆర్ఎస్ ఎన్నికల ఇన్‌చార్జి నారదాసు లక్ష్మణ్‌రావు, స్టేట్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్, రామగుండం మేయర్ డాక్టర్ అనిల్‌కుమార్, బీఆర్ఎస్ నాయకురాలు మూల విజయారెడ్డి ఉన్నారు.



గోదావరిఖని : ర్యాలీలో అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి కోరుకంటి చందర్



## పండుగ వాతావరణంలో చల్మెడ

▲ వేములవాడ పట్టణంలోని తెలంగాణ చౌక్ వద్ద కార్యకర్తల జన సందోహం

వేములవాడ, నవంబర్ 9: వేములవాడ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా చల్మెడ లక్ష్మీనరసింహారావు గురువారం అట్టహాసంగా నామినేషన్ వేశారు. ఉదయం రాజన్నను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసిన ఆయన, అనంతరం కుటుంబ సభ్యుల ఆశీర్వాదం తీసుకున్నారు. తర్వాత జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి, జడ్పీటీసీలు మ్యాకల రవి, నాగం భూమయ్యతో కలిసి వేములవాడ రిటర్నింగ్ కార్యాలయంలో నామినేషన్ పత్రాలు సమర్పించారు. అనంతరం పట్టణంలోని తిప్పాపూర్ ఆర్టీసీ బస్టాండ్ నుంచి ర్యాలీని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్, ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. సుమారు పదివేల మందికి పైగా అభిమానులు, కార్యకర్తలు తరలివచ్చారు. మూలవాగు వంతెన, రాజన్న ఆలయం, బద్ది పోచమ్మవీధి, పోలీస్‌స్టేషన్ మీదుగా తహసీల్ ఆఫీస్ వరకు ర్యాలీగా చేరుకున్నారు. దారి పొడవునా కార్యకర్తలు గులాబీ జెండాలు ప్రదర్శిస్తూ.. 'జై కేసీఆర్' 'జై చల్మెడ' నినాదాలతో హోరెత్తించారు. 'దేఖ్‌లేంగే' సాంగ్‌పై నృత్యం చేస్తూ జోష్ నింపారు. ఓపెన్‌టాప్ జీపులో అభ్యర్థి చల్మెడతోపాటు వినోద్ సుమారు రెండు కిలోమీటర్ల మేర ప్రజలు నీరాజనం పలికారు. దారి మధ్యలో వారిద్దరూ పోచమ్మ అమ్మవారిని దర్శనం చేసుకున్నారు. అంబేద్కర్, తెలంగాణ తల్లి విగ్రహాలకు పూలమాలలు వేసిన అనంతరం, రిటర్నింగ్ కార్యాలయానికి వెళ్లి మరో సెట్ నామినేషన్ దాఖలు చేశారు.



వేములవాడ పట్టణంలోని తెలంగాణ చౌక్‌లో ర్యాలీలో అభివాదం చేస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు, చిత్రంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్

